# ప్రేమయే దైవం, దైవమే ప్రేమ

ఏ ప్రేమశక్తిచే ఈ ధారుణీ చక్ర
　　మిరుసు లేకుండగా తిరుగుచుండు
ఏ ప్రేమ శక్తిచే నెల్లనక్షత్రాలు
　　నేలరాలక మింట నిలిచియుండు
ఏ ప్రేమశక్తిచే ఈ పుడమిపై బడక
　　కడలిరాయుడు కాళ్ళు ముడుచుకొనియె
ఏ ప్రేమశక్తిచే ఈరేడు లోకాలు
　　గాలిదేవుడు సురిటీలు విసరె
ఆమహాప్రేమశక్తియే ఆత్మశక్తి
అద్భుతమనంతమద్వితీయమగుశక్తి
నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల
ఈ మహాసృష్టియంతయు ప్రేమమయమె

ప్రేమస్వరూపులారా! భగవంతుడే ప్రేమ, ప్రేమయే భగవంతుని స్వరూపం. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అని భగవద్గీత బోధించింది. ప్రేమమయుడైన భగవంతుడు తన ప్రేమను జగత్తంతయు ఏవిధంగా ప్రకటింపజేయుచున్నాడో అదేవిధంగా, ప్రతిమానవుడు తన ప్రేమను జగత్తునందు వ్యాపింపజేయాలి. ప్రేమ అనిర్వచనీయమైనది. ఇట్టి ప్రేమతత్త్వమును మానవుడు గుర్తించుకొనలేక తన ప్రేమను ప్రాకృతమైన ధనకనకవస్తువాహనాదులపై ప్రసరింపచేయుచున్నాడు.

## అర్పణయే భక్తి లక్షణం

భగవంతుడు గుణాతీతుడు. ప్రేమకూడా గుణాతీతమైనది. అట్టి గుణాతీతమైన ప్రేమను గుణములతో చేర్చి మానవుడు తన జన్మను వ్యర్థం గావించుకొనుచున్నాడు. ఈ ప్రాకృతమైన జగత్తునందు మానవుడు తల్లిబిడ్డలప్రేమ, భార్యాభర్తలప్రేమ అంటూ అన్నదమ్ములప్రేమ,

sri sathyasai vachanamrutam

బంధుమిత్రుల ప్రేమ అంటూ అన్నింటికీ 'ప్రేమ' అనే పదమును ఉపయోగపెడుతున్నాడు. పుట్టక పూర్వం తల్లి ఎవరు? బిడ్డ ఎవరు? జన్మించిన తరువాతనే బిడ్డపై తల్లికి ప్రేమ ఏర్పడుచున్నది. అదేవిధంగా వివాహం తరువాతనే భర్త భార్యను, భార్య భర్తను ప్రేమించుకుంటారు. తల్లీబిడ్డల ప్రేమ, భార్యాభర్తల ప్రేమ, బంధుమిత్రుల ప్రేమ, అక్కచెల్లెండ్ర ప్రేమ, అన్నదమ్ముల ప్రేమ, ఇవన్నీ దేహసంబంధమైన నెగెటివ్ ప్రేమలు. దేహసంబంధమైన ప్రేమ, ప్రేమ అనిపించుకోదు. ఇచ్చిపుచ్చుకొనేదికూడా నిజమైన ప్రేమ కాదు. కొందరు భక్తులు "భగవంతుడా! నా కార్యం నెరవేరిందంటే నీకు పది కొబ్బరికాయలు కొడతాను" అని మ్రొక్కుకుంటారు. తుచ్ఛమైన బొచ్చు ఇచ్చి ఉచ్ఛమైన కోరికలు కోరుతుంటారు. ఇది భక్తియా? కాదు, కాదు. ఇచ్చిపుచ్చుకొనేది వ్యాపార సంబంధమైనదే గాని, భక్తిసంబంధమైనది కాదు. నిజమైన భక్తుడు కేవలం ఇచ్చుకోవటమే గాని, పుచ్చుకోవటమంటూ ఉండదు. అర్పణయే భక్తియొక్క ప్రధాన లక్షణం.

మానవజీవితం ఐహికాముష్మికముల మిళితం. కాని ఈనాటి మానవుడు ఆముష్మికమును విస్మరించి, ఐహికమునే విశ్వసించి, మనస్సుతో దీనిని అనుభవిస్తున్నాడు. మనస్సును అనుసరించినంతవరకు తనకుగాని, సమాజమునకుగాని, దేశమునకుగాని శాంతిభద్రతలు చేకూరవు. మనస్సుతో సంబంధాన్ని దూరం గావించుకొని, హృదయసంబంధమైన ప్రేమతత్త్వాన్ని పెంచుకున్నప్పుడే లోకంలో శాంతిభద్రతలు ఏర్పడతాయి.

### ధర్మాధర్మముల మిశ్రమమే ఈ జగత్తు

ధర్మాధర్మములు, శీతోష్ణములు, పాపపుణ్యములు, సత్యాసత్యములు అనే ద్వంద్వ సమన్వయమే సృష్టితంత్రము. ఈ జగత్తునందు కేవలం ధర్మం మాత్రమే ఉండుటకు సాధ్యం కాదు. అట్లే అధర్మం మాత్రమే ఉండుటకు వీలుకాదు. అధర్మమును పూర్తిగా నిర్మూలం చేసి ధర్మమును స్థాపించాలని ఆశిస్తుంటారు చాలమంది. ఇది అసాధ్యం. ధర్మాధర్మముల మిశ్రమమే ఈ జగత్తు. ధర్మాధర్మములు , సత్యాసత్యములు లేకుండా జగత్తు నిలువజాలదు. మానవుడు ధర్మమును మాత్రమే అనుసరించి, అధర్మమును విస్మరించి జీవితాన్ని గడపాలి.మానవత్వమును విస్మరించి పశుత్వమును అభివృద్ధిపరచుకుంటే శాంతి భద్రతలు నిలువజాలవు. కేవలం ఆహారనిద్రా భయమైథునములకు జీవితమును అంకితం గావించుకోవటం పశుత్వం. ఆహారము,

sri sathyasai vachanamrutam

నిద్ర, భయము, మైథునము – ఇవి మానవులకు, పశువులకు సమానమైనవి. ఐతే మానవధర్మము ఏమిటి? మొట్టమొదట "నేను మానవుడను" అని విశ్వసించాలి. ఇది అర్ధ సత్యము. "నేను పశువును కాదు" అని నిర్ణయించుకోవాలి. ఇది మిగిలిన అర్ధ సత్యము. తరువాత "నేను స్త్రీనా, పురుషుడినా, బ్రహ్మచారినా, గృహస్థుడనా; వానప్రస్థుడనా, సన్యాసినా?" అని విచారణ చేయాలి. ఏ స్థాయిలో ఉంటే ఆ స్థాయికి సంబంధించిన ధర్మాన్ని మాత్రమే అనుసరించాలి. బ్రహ్మచారిగా ఉండి, గృహస్థ ధర్మాన్ని అనుభవిస్తే జగత్తులో ధర్మసంకరమేర్పడుతుంది, సంఘంలో కల్లోలం ప్రారంభమౌతుంది. కనుక ఒకరు అనుసరించవలసిన ధర్మాన్ని మరొకరు అనుసరించకూడదు. మానవులందరికీ ఒకే ధర్మమని భావించకూడదు. అలా భావించటమే అధర్మమునకు మూలకారణం అవుతున్నది. ప్రతివ్యక్తి తన వయోప్రమాణానికి తగిన ధర్మాన్ని ఆచరించాలి. అట్టి నియమాన్ని ఉల్లంఘించటంచేతనే ఈనాడు ధర్మగ్లాని సంభవిస్తున్నది.

## ద్వేషం మతంలో లేదు, మతిలోనే ఉంది

భారతదేశమునకు ఇన్ని ఇక్కట్లు కల్గటానికి, దేశంలో ఇంత హింస జరగటానికి, ఇన్ని విధములైన కల్లోలములు ఏర్పడటానికి కులమతములే మూలకారణమని అనేకమంది భావిస్తున్నారు. అనేక మతములతో కూడినది భారతదేశం. మతములు లేకుండా ఉండుటకు వీలుకాదు. ఇన్ని మతములుండినప్పటికీ అనేక వేల సంవత్సరాలనుండి భారతీయులు ఐకమత్యంగా, అన్యోన్యంగా సోదరభావమును పెంచుకొని జీవితాన్ని గడుపుతూ వచ్చారు. కనుక, కులమతములు కల్లోలములకు ఏమాత్రమూ కారణాలు కావు. మానవ అంతఃకరణయొక్క ప్రభావమే కల్లోలములకు మూలకారణం. ఒక చిన్న ఉదాహరణ : జర్మనీదేశంలో కులమతములు ఏమాత్రమూ లేవు. కాని, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీ విభజనకు గురిఅయింది. ఈ విభజనకు కారణం మానవుని మనోప్రభావమే గాని, కులమతములు కాదు కదా!

మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటె
వస్త్ర భేదము వేరు దారమొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటె
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె

sri sathyasaivachanamrutam

జీవజంతువులు వేరు జీవుండు ఒక్కడె
కులములన్నియు వేరు పుట్టుక ఒకటె
దర్శనంబు వేరు దైవమ్ము ఒక్కడె
పూల వన్నెలు వేరు పూజ ఒకటె
తెలియలేకను మానవుల్ తెలివి తప్పి
బ్రతుకుకోసము బహుబంధ బద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పఱతు?
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

మతములన్నీ మానవుణ్ణి దివ్యత్వానికి చేర్చటంకోసం ఏర్పడినవేగాని, కల్లోలములను అభివృద్ధిపరచుకోవటానికి కాదు. మతములలో ఏమాత్రమూ ద్వేషం లేదు; మతులలోనే ఉన్నది ద్వేషం. "మతులు మంచివైన మతమేది చెడ్డది?" కనుక జాతి, మత భేదములకు అవకాశం ఇవ్వకూడదు. జాతి అనగా అర్థమేమిటో మీరు గుర్తించాలి. జాతి అనేది స్వరూపానికి సంబంధించినది. ఉదాహరణకు, పూవులన్నీ ఒకే జాతికి చెందినవి. వృక్షములన్నీ ఒకే జాతికి చెందినవి. వస్త్రములన్నీ ఒకే జాతికి చెందినవి. అదేరీతిగా మానవులంతా ఒకే జాతికి చెందినవారు. మామిడిచెట్టు, వేపచెట్టు రెండూ వృక్షజాతికి చెందినవేకదా యని వేపవిత్తనమును నాటి, మామిడి ఫలమును ఆశిస్తే లభిస్తుందా? లభించదు. వృక్షజాతి ఒక్కటేకాని ఫలములనేకంగా ఉన్నాయి. వృక్షజాతిలో ఫలములయొక్క రుచులు 450 రకాలుగా ఉన్నాయి.

అట్లే మానవజాతికూడా ఒక్కటేకాని, మానవుల మనోభావములు, సంకల్ప, వికల్పములు, ప్రవర్తనలు వేరువేరుగా ఉన్నాయి. ఇవన్నీ అంతఃకరణయొక్క ప్రభావములే! జాతిని నిర్మూలం చేయాలనుకోవటం వెఱ్ఱితనం. వ్యక్తిని నిర్మూలం గావించవచ్చుగాని, జాతిని ఎవ్వరూ నిర్మూలం గావించలేరు. మానవజాతి ఎప్పటికీ సత్యమైనది, నిత్యమైనది. ఇట్టి పవిత్రమైన జాతియొక్క ఏకత్వాన్ని అర్థం చేసుకోకుండా కలతలు, కల్లోలములకు అవకాశం ఇవ్వటం అజ్ఞానమే. ఈనాడు జగత్తులోని కల్లోలములకు మూలకారణం మానసిక ప్రవృత్తులు, మనిషి యొక్క ప్రవర్తనయే. ప్రాచీన భారతీయ సంస్కృతియందు ప్రధానమైన తత్త్వము ఏకత్వమే. అట్టి



srisathyasaivachanamrutam

ఏకత్వమును గుర్తించాలంటే ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి. ప్రేమయే దైవం, దైవమే ప్రేమ.

ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతో సంధింప నీమమగును
కాన ప్రేమను పూర్తిగ కలిగియున్న
అద్వితీయము చెందగ నర్హుడగును.

కాని, దేహాభిమానమువలన మీ ప్రేమ భిన్న, భిన్నంగా రూపొందుతున్నది. దేహసంబంధమైన ప్రేమ, ప్రేమ కాదు.

**"ప్రేమ్ ఈశ్వర్ హై, ఈశ్వర్ ప్రేమ్ హై"**

"స్వామి ప్రేమ, ప్రేమ....అంటున్నారు. ఏమిటీ ప్రేమయొక్క రూపం?" అని అనేకమంది అనుకుంటారు. "ప్రేమ్ ఈశ్వర్ హై, ఈశ్వర్ ప్రేమ్ హై" ప్రేమయే ఆత్మ. ప్రేమయే బ్రహ్మ. ప్రేమయే ఉనికి. సర్వమూ ప్రేమమయమే. ఇలాంటి ప్రేమకు ఏ రూపమని నిర్ణయించగలము? మీయందున్నది, నాయందున్నది ఒకే ఆత్మయే, ఒకే హృదయమే. ఈ ఏకత్వాన్ని మీరు చక్కగా గుర్తించుకుంటే ద్వేషమనేదే ఉండదు. దేహాభిమానంచేతనే కోపము, తాపము, ఈర్ష్య, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణాలు ఏర్పడుతున్నాయి. ఏకత్వాన్ని భిన్నత్వంగా భావించుకోవటంచేత కలహములు, కల్లోలములు విజృంభిస్తున్నాయి. దేహములు వేరువేరుగా ఉండవచ్చును. దేహములు వేరైనంత మాత్రమున ఆత్మతత్త్వం వేరు కాజాలదు. "ఏకాత్మా సర్వ భూతాంతరాత్మ" "అద్వైతం బ్రహ్మ" – ఇట్టి ఏకత్వమును మీరు దృఢంగా విశ్వసించాలి. ఈ జగత్తులో దివ్యత్వం లేని పదార్థం లేదు. (హేండ్‌కర్చీఫ్‌ను చూపుతూ) ఈ బట్టలో కూడా దివ్యత్వం ఉన్నది; ఈ పువ్వులో కూడా దివ్యత్వం ఉన్నది. వీటిలో దివ్యత్వమే లేకపోతే ఎవ్వరూ వీటిని ఆశించరు. కనుక అంతా దివ్యత్వమే! "ఈశావాస్య మిదం జగత్" జగత్తంతయు ఈశ్వరుడే నిండియున్నాడు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" బ్రహ్మతత్త్వం సర్వత్రా వ్యాపించి యుంది. ఈసత్యాన్ని మీరు గుర్తించాలి.

**ప్రేమకు మూలం విశ్వాసం**

ప్రేమస్వరూపులారా! అనేక పర్యాయములు నేను మిమ్మల్ని "ప్రేమస్వరూపులారా!" అని సంబోధిస్తుంటాను. ఎందుకంటే ప్రేమయే మీ సత్యస్వరూపం. అది "నిర్గుణం, నిరంజనం,

sri sathyasai vahanamrutam

సనాతనం, నికేతనం, నిత్య శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలస్వరూపిణిం". మీరు మీ తల్లిని ప్రేమిస్తున్నారు. ఎప్పటి నుండి? ఆమెకు మీరు పుట్టి, పెరిగి, పెద్దవారైన తరువాత, ఆమె మీ తల్లి అనే అభిమానం ఏర్పడిన తరువాత ఆమెను ప్రేమిస్తున్నారు. "ఈమె నా తల్లి" అనే విశ్వాసమే లేకపోతే మీరు ఆమెను ప్రేమించలేరు. కాబట్టి విశ్వాసమే ప్రేమకు మూలకారణం.

విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ
ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ
శాంతి ఎక్కడో సత్యమక్కడ
సత్యమెక్కడో ఆనందమక్కడ
ఆనందమెక్కడో దైవమక్కడ

శాంతి, సత్యము, ఆనందము ఎక్కడో బయటలేవు; మీయందే ఉన్నవి. మీరే శాంతిస్వరూపులు; మీరే సత్యస్వరూపులు; మీరే ఆనందస్వరూపులు. వీటికోసం బయట వెదకటమే మీరు చేస్తున్న పొరపాటు. ఏదీ మీకంటే వేరుగా లేదు. అన్నీ మీనుండి వచ్చినవే! ప్రతి ఒక్కటీ అంతర్భావంయొక్క ప్రతిబింబమే (Everything is the reflection of the inner being).

**ప్రేమరహిత సాధనలు నిష్ప్రయోజనాలు**

అద్దంలో కనిపించే మీ ప్రతిబింబమును మీరు ప్రేమించినట్లుగా అందరినీ ప్రేమించండి. ఏ దేహాన్ని చూచినా అందులో నా ప్రతిబింబమున్నదని భావించండి. ఈ నిత్యసత్యమును ప్రబోధించే నిమిత్తం భగవద్గీతయందు కృష్ణుడు "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః " అన్నాడు. "నీవు నా అంశమే, నేను, నీవు వేరు కాదు. దేహాభిమానంవల్లనే మార్పులు జరుగుతున్నాయి. కాని మన ప్రేమతత్త్వం ఒక్కటే" అన్నాడు. ప్రేమను వదలి ఎన్ని సాధనలు చేసినా, అవి నిష్ప్రయోజనములే! ఈ ప్రపంచం ఒక అద్దంవంటిది. ఈ అద్దమును ఆధారం చేసుకొని మీరు బ్రతుకుతున్నారు. ఈ అద్దంలో చూసేవన్నీ నెగెటివ్‌లే. అద్దంలో మీ కుడికన్ను ఎడమకన్నుగా, కుడిచేయి ఎడమచేయిగా కనిపిస్తుంది. అలాంటిది సత్యమని మీరు ఎలా భావించగలరు? అద్దమును తొలగిస్తే ప్రతిబింబముకూడా పోతుంది. మిగిలేది బింబమే. అదే సాక్షాత్కారం. "సాక్షాత్ ఆకారం సాక్షాత్కారం" అన్నారు. కొందరు "నేను ధ్యానంలో సాక్షాత్కారం



sri sathyasai vachanamrutam

పొందా” అంటారు. కాని అది భ్రమయే గాని, సాక్షాత్కారం కాదు. ఏది సాక్షాత్కారం? మానవుడు తనను తాను దైవస్వరూపంగా విశ్వసించి, ప్రేమ తత్త్వాన్ని అనుభవించాలి.

**ప్రాకృతప్రేమ - దైవప్రేమ**

ఈ లౌకికమైన సంబంధ బాంధవ్యములు కదలిపోయే మేఘములవలె వస్తుంటాయి, పోతుంటాయి. కాలంతోపాటు అవికూడా మార్పు చెందుతుంటాయి. కాని, నిజమైన ప్రేమ ఏనాటికీ మారదు. ప్రాకృతమైన ప్రేమ ఈనాడు ప్రేమగా ఉంటుంది, రేపు ద్వేషంగా మారుతుంది; ఈనాడు ఇష్టంగా ఉంటుంది, రేపు అయిష్టంగా మారుతుంది. కాని, దైవ ప్రేమ ఇష్టాయిష్టములతో ఏమాత్రమూ సంబంధం లేని పవిత్రమైన ప్రేమ. ప్రేమను మించిన దైవం లేదు. జీసస్ అనండి; జోరాష్ట్ర అనండి; అల్లా అనండి; బుద్ధ అనండి; గురునానక్ అనండి. ఇవన్నీ పెట్టిన పేర్లేగాని, పుట్టిన పేర్లు కావు. ప్రేమ అనేదే పుట్టిన పేరు. మీదేహానికి పేరు ఎవరుపెట్టారు? అది మీతల్లిదండ్రులు పెట్టిన పేరేగాని, పుట్టిన పేరు కాదు కదా! అదేరీతిగా దేహసంబంధమైన ప్రేమకూడా పెట్టిన ప్రేమయే. పెట్టిన ప్రేమ ఏనాటికైనా మార్పుచెందుతుంది. కాని దైవప్రేమ ఏనాటికీ మారదు. అట్టి మారని ప్రేమతత్త్వాన్ని మీరు విశ్వసించాలి. అదియే నిజమైన భక్తి.

**ప్రతిఫలాపేక్షరహిత ప్రేమయే భక్తి**

కొందరు వేంకటేశ్వరాలయానికి వెళ్లి “స్వామీ! నా కోర్కెను నెరవేర్చితే నీకు బ్రహ్మోత్సవం చేయిస్తాను” అని, “స్వామీ! నాబిడ్డకు వివాహమయిందంటే నీకు కళ్యాణోత్సవం చేయిస్తాను” అని ప్రార్థిస్తుంటారు. భగవంతునికా వీళ్ళు వివాహం చేయించేది? భగవంతుడు తన వివాహం కోసమని వీళ్ళ కోర్కెలు తీరుస్తాడా? ఈ విధంగా భగవంతునికే ఆశచూపి మోసం చేయటానికి ప్రయత్నిస్తున్నారు, ఈనాటి భక్తులు. ప్రతిఫలాపేక్షతో భగవంతుణ్ణి ప్రార్థించటం భక్తియే కాదు. ప్రతిఫలాపేక్ష రహితమైన ప్రేమతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. భక్తి అనేది ప్రేమకు పర్యాయపదమే! భక్తివల్ల అనేక శక్తులు అభివృద్ధి అవుతాయి. భక్తినుండియే రక్తి, విరక్తి, ముక్తి కల్గుతాయి.

**ప్రేమతో కూడిన హృదయమే దైవస్వరూపం**

చాలమంది పిల్లలు, Swamy! I love you అని వ్రాస్తుంటారు. love (ప్రేమ) అనే పదానికి చిహ్నంగా హృదయం బొమ్మ గీస్తారు. దీని అంతరార్థం ఏమిటి? ప్రేమతో కూడినది



sri sathyasai vahanamrutam

హృదయం, దయతో కూడినది హృదయం. కరుణతో కూడినది హృదయం. కాబట్టి హృదయమే దైవస్వరూపం. మీ ప్రేమను మీ స్వార్థానికి మాత్రమే పరిమితం గావించక అందరికీ పంచాలి. కేవలం తోటిమానవులకు మాత్రమే కాదు, పశుపక్షి మృగాదులకు కూడా పంచాలి. అందరూ ఐకమత్యంగా ఉండాలి. విశ్వమంతా ఒక కుటుంబముగా రూపొందాలి. అప్పుడింక ద్వేషాలు, కోపాలు, తగాదాలు ఉండనే ఉండవు. ఈనాటి మానవునికి విశాల హృదయం లేకపోవటంచేతనే లోకంలో ఎక్కడ చూచినా కలహములు, కల్లోలములు విలయతాండవం చేస్తున్నాయి. ఎవరియందు చూసినా సంకుచితమైన ప్రేమ (Contraction of Love) కనిపిస్తున్నదిగాని, విశాలమైన ప్రేమ (Expansion of Love) కనిపించటం లేదు. సంకుచిత హృదయాలు మానవుడు సృష్టించుకున్నవి. భగవంతుడు సృష్టించినది విశాలహృదయాన్ని. దానికి ఇంత, అంత అని పరిమితి లేదు. అట్టి అపరిమితమైన ఆత్మతత్త్వాన్ని మానవుడు పరిమితంగా పెట్టుకోవటం చేత అనేక కష్టనష్టములకు గురి అవుతున్నాడు.

**భగవంతుడే నిజమైన గురువు**

ఈనాడు గురుపూర్ణిమ. గురువు అనగా ఎవరు? “గుకారో గుణాతీతఃరుకారో రూప వర్జితః” గుణాతీతుడు, రూపరహితుడు భగవంతుడే! అంతేకాదు. “గుకారో అంధకారస్యాత్ రుకార స్తన్నిరోధకః” అజ్ఞానాంధకారమును నిర్మూలించేవాడు గురువు. అంధకారమును నివారణ గావించేది ప్రకాశము. ‘భగవాన్’ అనే పదములో ‘భ’ అనగా ప్రకాశము అని అర్థం. కనుక భగవంతుడే నిజమైన గురువు. ఎక్కడ చూచినా ప్రకాశించేవాడు భగవంతుడే! సర్వత్రా ఉన్నది భగవంతుడే! కనుక, ఎవ్వరినీ ద్వేషించకూడదు. ఈనాడు లోకంలో కొందరు సంకుచిత భావాలతో ద్వేషాన్ని పెంచుకొని తోటి మానవుల ప్రాణాలు తీస్తున్నారు. ఎంతపాపము! ఈవిధంగా చేస్తే, దైవానికే హాని తలపెట్టిన వారవుతారు. ఒకరిని ద్వేషించి, హింసించి అనుభవించే ఆనందం రాక్షసానందం. ఎవరి ద్వేషం వారికే హాని కల్గిస్తుంది. మీరు ఎవరిని ద్వేషించినా, ఎవరిని హింసించినా రేపటిదినం మిమ్మల్ని ద్వేషించేవారు, హింసించేవారు మరొకరొస్తారు. కనుక అందరినీ సంతోషపెట్టండి. అప్పుడే మీకు సరియైన ఆనందం లభిస్తుంది. హింసించటం, చంపటం గొప్పతనం కాదు. కీడు కీటకమైనా చేయగలదు. ప్రాణం కాపాడటంలోనే గొప్పతనమున్నది.

sri sathyasai vachanamrutam

ప్రేమస్వరూపులారా! మీరు చేసే ప్రతిపనికి reaction, resound, reflection (ప్రతిచర్య, ప్రతిధ్వని, ప్రతిబింబము) ఉంటాయి. ఏనాటికైనా వాటిని మీరు అనుభవించక తప్పదు. ఈనాడు ఏదో చెడ్డపని చేసి తప్పించుకున్నానని ఆనందించకండి. రేపు కాకపోతే ఎల్లుండైనా దాని ఫలితం కనిపిస్తుంది. కనుక, మంచి పనులు చేయండి. మీకు మంచిఫలితమే కల్గుతుంది. అయితే మంచి పనిచేసిన తక్షణమే మీకు మంచి ఫలితం కలుగలేదని, నిరాశకు గురికాకండి. కొంచెం ఓపికపట్టండి. ఏమానవునికైనా కర్మఫలితం తప్పినది కాదు. అయితే, దుష్ఫలితమును తగ్గించటానికి ప్రార్థన కొంత సహాయం చేస్తుంది. ప్రార్థన అనగా దైవానికి కృతజ్ఞత చెప్పుకోవటం. కృతజ్ఞతను మీరు ఆచరణలో చూపాలి. కృతఘ్నుని దృష్టినుండి సూర్యుడు దూరమైపోతాడు. కనుకనే, సూర్యుణ్ణి "కృతఘ్నఘ్నాయనమః" అని వర్ణిస్తున్నారు.

## క్షమ చాల గొప్పది

మానవునికి క్షమాగుణం చాల ప్రధానమైనది. క్షమ సత్యము. క్షమ ధర్మము. క్షమ వేదము. క్షమ అహింస. సర్వలోకములందు క్షమను మించినది లేదు. ఎవరైనా మీకు అపకారము చేసియుంటే వారిని క్షమించండి; అది (Good for me) (నా మంచికోసమే) అనుకోండి. ఎవరైనా మిమ్మల్ని తిడితే "దేహాన్ని తిట్టాడా, లేక ఆత్మను తిట్టాడా?" అని విచారణ చేయండి. ఒకవేళ వాడు మీదేహాన్ని తిడితే, ఒకవిధంగా మీకు ఉపకారం చేసినట్లే. ఎందుకంటే దేహం అనిత్యమైనది, మలమూత్రదుర్గంధమాంసరక్తములతో కూడినది అని మీరే తిట్టుకుంటున్నారు. ఒకవేళ ఆత్మను తిడితే - వానియందు, మీయందు ఉన్నది ఒకే ఆత్మ కాబట్టి, తనను తాను తిట్టుకున్నాడనుకోండి. ఎంత గొప్ప క్షమ ఇది! ఇట్టి హృదయవిశాలతను మీరు కల్గియుండాలి.

## జీవుడే దేవుడు

అజ్ఞానమును దూరం గావించేవాడు గురువు. ఎట్టి అజ్ఞానమును? 'దేహమే నేను' అనే అజ్ఞానమును దూరం చేస్తాడు. దేహం కేవలం ఒక పనిముట్టు. ఇదే సత్యమని మీరు భావించకూడదు. ఈ జగత్తులో కర్మలనాచరించే నిమిత్తమై భగవంతుడు మీచేత దేహమును ధరింపజేశాడు. ఇది భగవంతుని వరప్రసాదం. "దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః" దేహమే దేవాలయం, జీవుడే దేవుడు. కనుక ఏ దేహాన్ని చూచినా, ఇది భగవంతుని ఆలయమని

sri sathyasai vachanamrutam

నమస్కారం చేయండి. మీ విరోధికి కూడా నమస్కరించండి. అది దైవానికే చెందుతుంది. "సర్వజీవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి, సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" మీరు ఎవరిని తిరస్కరించినా అది కూడా దైవానికే చెందుతుంది. ఇట్టి ఏకాత్మభావాన్ని అభివృద్ధిపరచుకోండి బంగారూ!

**'త్యజ దుర్జన సంసర్గం'**

మిమ్మల్ని అప్పుడప్పుడు నేను "బంగారూ, బంగారూ" అంటుంటాను. బంగారు అనగా ఏమిటి? భగవంతుణ్ణి "హిరణ్యగర్భాయ నమః" అని వర్ణిస్తారు. మీరు కూడా హిరణ్యంతో కూడినవారు. మీ హృదయమంతా హిరణ్మయమే. హిరణ్యమనగా బంగారం. బంగారం చెడిపోయేది కాదు. దానిని ఏ రూపంగానైనా మార్చుకోవచ్చు. రూపాలు మారేది బంగారే, రూపరహితమైనదీ బంగారే. స్వచ్ఛమైన బంగారంలో రాగి కలిపితే దాని వెల కొంత దిగుతుంది. దానిలో సీసము చేర్చితే దాని వెల ఇంకా దిగుతుంది. ఈవిధంగా బంగారంలో ఇతర లోహాలు కలిసే కొలది దాని విలువ తగ్గిపోతూ ఉంటుంది. అదేరీతిగా పుట్టినప్పుడు మానవుడు పరిశుద్ధమైన బంగారంగా ఉంటున్నాడు, చాల విలువ కలిగియుంటున్నాడు. కాని పెరిగే కొలది ఆశలనే 'రాగి' అన్యాయమనే 'సీసము' కలవటంచేత తన విలువ తగ్గిపోతున్నది. కనుకనే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను.

త్యజదుర్జన సంసర్గం భజ సాధు సమాగమం
కురు పుణ్య మహోరాత్రం స్మర నిత్యమనిత్యతాం

దుస్సంగానికి దూరంగా ఉండాలి; సత్సంగంలో ప్రవేశించాలి; అహోరాత్రములు పుణ్యకార్యముల నాచరించాలి; ఏది నిత్యము, ఏది అనిత్యము అని విచారణ చేయాలి. అదియే మానవధర్మము. నోరున్నది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడకూడదు. కన్నులున్నాయి కదా అని అన్నింటినీ చూడకూడదు. కీచకుడు ద్రౌపదిని చెడ్డభావంతో చూచాడు. తరువాత ఏమి జరిగింది? భీముడు పోయి వాని తలను ముక్కలు చేశాడు. కనుకనే బుద్ధుడు సమ్యక్‌దృష్టిని అలవర్చుకొన్న తరువాతనే బుద్ధునికి నిర్వాణం ప్రాప్తించింది. దేనిని చూచినా దైవస్వరూపంగా భావించాలి. మంచినే తలచాలి; మంచినే చూడాలి; మంచినే చెప్పాలి. మంచినే వినాలి; మంచినే చేయాలి. అప్పుడే మీరు దివ్యత్వాన్ని పొందగలరు.

sri sathyasai vacharamrutam

## నాకు ఎప్పుడూ ఆనందమే!

ప్రేమస్వరూపులారా! ఈ దేహానికి 75 వ సంవత్సరం వస్తున్నది. నేను నిరంతరము ఎంతో ఆనందంగా ఉంటున్నాను. కారణమేమిటి? "అంతా ఒక్కటే" అన్న సత్యం నాకు తెలుసు. మీరుకూడా ఈ సత్యాన్ని గుర్తించండి. అప్పుడు తప్పక మీరుకూడా ఆనందాన్ని అనుభవిస్తారు. నాకు ఎవరూ ద్వేషులు లేరు. నేను ఎవరికీ ద్వేషిని కాను. కాబట్టి నాకు ఎట్టి భయమూ లేదు. కారణమేమిటి? అంతా నాయొక్క స్వరూపమే! అందరియందున్నది ఒకే ఆత్మ తత్త్వము. కల్లాకపటం ఎఱుగని పసిబిడ్డ మిమ్మల్ని చూసి నవ్వినపుడు మీరు కోప్పడతారా? లేదే. మీరుకూడ నవ్వుతారు. అదేరీతిగా నేను ఆనందంగా చిరునవ్వు నవ్వితే, నాతోపాటు అందరూ ఆనందాన్ని అనుభవిస్తారు. కనుక మంచిభావాన్ని పెట్టుకోండి; పవిత్రమైన హృదయాన్ని పెట్టుకోండి. అప్పుడు మీకు లభించే ఫలితంకూడ పవిత్రంగానే ఉంటుంది. ఇంతవరకు నాకు ఏ ఒక్కటీ చెడ్డ జరగలేదు; అంతా మంచే జరిగింది. మనం మంచిగా ఉంటే అంతా మంచే జరుగుతుంది. ఎలాంటి కష్టములు కల్గినా భగవంతునిపై విశ్వాసమును కోల్పోకూడదు. విశ్వాసమొక్కటి ఉంటే ఎంతైనా సాధించవచ్చు. విశ్వాసమే మీ శ్వాసగా భావించాలి.

ప్రతి మానవుడు ప్రేమస్వరూపుడే! ఏదో అప్పుడప్పుడు ఆహారవిహారాదుల దోషం వల్ల మీలో కోపము, తాపము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణాలు కల్గుతుంటాయి. ఎట్టి 'ఫుడ్డో' అట్టి 'హెడ్డు', ఎట్టి 'హెడ్డో' అట్టి 'గాడ్' Food, Head, god. – మూడూ అవినాభావ సంబంధం కల్గినవి. కాబట్టి మీరు మొట్టమొదట మంచి ఆహారాన్ని తీసుకోవాలి. మంచి ఆహారం అంటే విలువైన ఆహారం కాదు; సాత్త్వికమైన ఆహారం. సాత్త్వికాహారం భుజించటంవల్ల మీలో సాత్త్వికమైన భావాలే కల్గుతాయి; మీరు పలికే ప్రతి పలుకు పవిత్రమైనదిగానే ఉంటుంది.

**"దున్నపోతా!"**

మిమ్మల్ని సరిదిద్దటానికి అప్పుడప్పుడు నేను కోపం నటిస్తాను కాని, నిజంగా నాకు కోపం లేదు. కోపం వచ్చినప్పుడు ఏ తిట్టు తిడతాను? "దున్నపోతా!" అంటాను, అంతే! అదే నాతిట్టు. నీవు మంచి కార్యాలు చేయకపోతే నిజంగా నీవొక Buffalo (దున్నపోతు) అనే చెప్పవచ్చు. మంచి పనులు చేసినప్పుడే నీవొక Good fellow .(మంచివ్యక్తి) అవుతావు. ఈనాడు అందరూ దున్నపోతులుగానే ఉంటున్నారు. కారణమేమిటి? మంచి పనులు చేయటం

లేదు. వర్షం కురిసినప్పుడు ఆవు, దూడలు పరుగెత్తుతాయి. కాని దున్నపోతు పరుగెత్తదు. ఉన్నచోటే తడుస్తూ ఉంటుంది. మీరు దున్నపోతులు మాదిరి తయారుకాకూడదు. మీలో పరివర్తన రావాలి. నేను అందరినీ ప్రేమిస్తాను. ప్రేమయే నా స్వరూపము. ప్రేమయే నిజమైన శక్తి. నేను నా ప్రేమను అందరికీ ఏరీతిగా పంచుతున్నానో, మీరు నా అంశమే కనుక, మీరు కూడా మీ ప్రేమను అందరికీ పంచండి. అప్పుడు నేను చేసినదే మీరు చేసినవారౌతారు. అప్పుడు మీరుకూడా భగవత్స్వరూపులే! ఇట్టి పవిత్రమైన భావాన్ని మీరు అనుసరించినప్పుడు జగత్తంతా నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా వర్ధిల్లుతుంది.

**ప్రేమ! ప్రేమ! ప్రేమ!**

ప్రేమస్వరూపులారా! అజ్ఞానమును నిర్మూలం గావించుకొని, ప్రజ్ఞానజ్యోతిని వెలిగించుకొని, దైవత్వంలో ఐక్యం కావాలి. ఇదియే ఈనాడు స్వామి మీకు అందించే ప్రధానమైన సందేశము. ప్రేమ, ప్రేమ, ప్రేమ! ప్రేమను మించినది జగత్తులో మరొకటిలేదు. దైవప్రేమ దుర్గుణాలను దూరం చేస్తుంది! రోగాలను నివారణ గావిస్తుంది. అన్నింటికీ ప్రేమయే ప్రధానము. ప్రేమంటే దేహాన్ని ప్రేమించటం కాదు; హృదయాన్ని ప్రేమించాలి; హృదయమునందున్న దివ్యత్వాన్ని ప్రేమించాలి. మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియాలు - ఇవన్నీ పనిముట్లు, వీటన్నిటికీ మీరే మాస్టర్ (యజమాని) Master the mind, be a Master mind.మీరు మనస్సుకు యజమాని కావాలేగాని, బానిస కాకూడదు. నిరంతరం దైవచింతన చేయండి. మీరు ఏ నామం చేసినప్పటికీ, ఏ రూపాన్ని స్మరించినప్పటికీ - దైవం ఒక్కడే, ఒక్కడే, ఒక్కడే!

**(16.7.2000 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vahini amrutam